క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠాపనకు ముమ్మర పనులు


యాలాల: ఉత్సవాలకు ముస్తాబవుతున్న రక్తమైసమ్మ ఆలయం

యాలాల: మండల పరిధిలోని దౌలాపూర్ శివారులోని రక్త మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 13 నుంచి 15 వరకు మూడు రోజుల పాటు నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే ఆలయ పరిసరాలను శుభ్రం చేయించి, మొరంతో చదును చేయించారు. శనివారం ఆలయానికి పెయింటింగ్ పనులను పూర్తి చేయించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ అభివృద్ధి, ఇతరత్రా పనుల నిర్వహణకు దాతలు ఎవరైన సాయం చేయాలనుకుంటే 8897075404, 8688257557లలో సంప్రదించాలని కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం


పరిగి: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గౌస్‌పాష

పరిగి: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పరిగి లీగల్ ఎయిడ్ కౌన్సిల్ గౌస్‌పాష పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా పట్టణ కేంద్రంలోని తుంకల్‌గడ్డలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చట్టం దృష్టిలో అందరు సమానమేనని, చట్టాన్ని అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. 18 సంవత్సరాల లోపు ఉన్న వారు వాహనాలను నడపడం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది అనిల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మాజీ ఉపసర్పంచ్ కరణం శ్రీకాంత్‌రావు


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీకాంత్‌రావు

దోమ: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఉపసర్పంచ్ కరణం శ్రీకాంత్ రావు సూచించారు. శనివారం దోమ మండల పరిధిలోని మోత్కుర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

నందిగామ: అధికారంలోకి వచ్చిన కేవలం 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి 11 నెలలు ముగుస్తున్నా నేటివరకు హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని చేగూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ మామిళ్ల విఠల్ ముదిరాజ్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఆచరణకు సాధ్యం కానీ హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హామీల అమలు, అభివృద్ధి పనులు పక్కన పెట్టి బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అవినీతికి పాల్పడిందని ఆరోపించడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికైనా ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సామూహిక యజ్ఞాలు

శంకర్‌పల్లి: సింగాపురంలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న మరకత కార్యసిద్ధి పంచముఖ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా శనివారం సామూహిక యజ్ఞ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సుమారు 100 జంటలు యజ్ఞంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితుల నుంచి ఆశీర్వచనాలు అందుకున్నారు. మధ్యాహ్నం భారతి తీర్థ అవార్డు గ్రహీతలు బ్రహ్మశ్రీ బంగారయ్యశర్మ, డా.నోరి నారాయణమూర్తి ప్రవచనాలు చెప్పారు. ఆదివారం మరకత పంచముఖ హనుమాన్ విగ్రహ, జయస్తంభ ప్రతిష్ఠాపన ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ప్రారంభమైన కులగణన సర్వే

- ఇళ్లు, భూముల విషయంలో సమాచారం నిరాకరణ
- ప్రజల నుంచి ఎదురవుతున్న వ్యతిరేకత


పెద్దేముల్: చైతన్యనగర్‌లో సర్వే చేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

పెద్దేముల్: కుటుంబాల గుర్తింపు పూర్తి కాక.. పూర్తి స్థాయిలో ఎన్యుమరేటర్లు హాజరు కాక శనివారం తొలి రోజు పెద్దేముల్ మండలంలో కుల గణన సర్వే అంతంతే కొనసాగిందని తెలుస్తుంది. పెద్దేముల్ మండలంలో 38 గ్రామ పంచాయతీల్లో 103 బ్లాక్‌లకుగాను 103 మంది ఎన్యుమరేటర్లను నియమించింది. ఎన్యుమరేటర్లు ఇండ్లకు వెళ్లి 56 అంశాలకు సంబంధించిన సమాచారం సేకరించవలసి ఉంది. దానికి సుమారు 40 నుంచి 50 నిమిషాల సమయం పడుతుందని వారు తెలిపారు. ఇండ్ల విషయమై, భూమి సర్వేతో ఉన్న పెన్షన్ల విషయమై సమాచారం సేకరించే సమయంలో జనం నుంచి సరైన సమాధానాలు రావడం లేదని ఎన్యుమరేటర్లు అధికార్లతో నివేదిస్తున్నారు.

ప్రారంభమైన సర్వే

అనంతగిరి: సర్వేలో మొత్తం 54 ప్రశ్నలతో ఉంది. సర్వే కోసం అధికారులు ముందుచూపుగా ఎన్ని ఇండ్లు ఉన్నాయి, అందులో ఎన్ని కుటుంబాలు ఉన్నాయనే విషయంలో 3 రోజులుగా స్పష్టతకు వచ్చారు. దీంతో ఏ ఇంటికి స్టిక్కర్లు అట్టించారో వాటినే సర్వే చేస్తున్నారు. 50 నుంచి 54 ప్రశ్నల వరకు, ఉన్న వాటిలో ఉప ప్రశ్నలే చాలా కీలకంగా ఉన్నట్లు గుర్తిస్తున్నారు. ముఖ్యంగా ఏమైన స్థిరాస్తులు ఉన్నాయా? చరాస్తులు ఉన్నాయా? అనే ప్రశ్నల వద్దే ప్రజలు చెప్పడానికి సంకోచిస్తున్నట్లు తెలుస్తుంది. వికారాబాద్ మున్సిపల్‌లో నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్ లక్ష్మీనారాయణ, కమిషనర్ జాకీర్ అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్, ఎంపీడీఓ వినయ్‌కుమార్ పర్యవేక్షించారు.


దుద్యాల్: అలేడ్‌లో వివరాలు నమోదు చేస్తున్న ఎన్యుమరేటర్

ప్రజల నుంచి ఎదురవుతున్న వ్యతిరేకత

దుద్యాల్: మూడు రోజులుగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఇళ్లను గుర్తించి స్టిక్కరు అంటించారు. శనివారం ఎన్యూమరేటర్లు ఇంటింటికి తిరుగుతూ కుటుంబ వివరాల సేకరణ చేపట్టారు. వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లకు ప్రజల నుంచి అనేక ఇబ్బందికర ప్రశ్నలే ఎదురవుతున్నాయని వారు తెలిపారు.

ఇద్దరు భార్యలున్న ఇళ్లలో సమస్య

ధారూరు: ధారూరు మండలంలో రాజకీయ, కుల, ఆర్థిక, విద్య, ఉపాధి తదితర అంశాలపై సర్వే చేపట్టిన ఎన్యుమరేటర్లకు పలు సమస్యలు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. ఇంటి యజమానులు సైతం వివరాలు సరిగ్గా చెప్పలేక తడబడుతున్నారు. ముఖ్యంగా ఇద్దరు భార్యలున్న కుటుంబాల్లో ఒకరి పేరు రాసి మరొకరి పేరుకు అవకాశం లేకపోవడంతో వాదనలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని ఎన్యుమరేటర్లు పేర్కొన్నారు.

మొదటి రోజు 1500 ఫార్మట్లు

తాండూరు రూరల్: 2011 సర్వే ప్రకారం మండలంలో 13,580 కుటుంబాలు ఉండగా ప్రస్తుతం 14,800 కుటుంబాలు ఉన్నాయి. 33 గ్రామ పంచాయతీల్లో 112 మంది ఎన్యుమరేటర్లు 11 మంది సూపర్‌వైజర్లు సర్వే కొనసాగిస్తున్నారు. మొదటిరోజు 1500 ఫార్మట్లు వచ్చాయి. దీంతో ఆయా గ్రామాల్లో ఎన్యుమరేటర్లు సర్వే ప్రారంభించారు. మొత్తం 56 అంశాలు ఉన్నాయి. తొలిరోజు కావడంతో ఒక్కో కుటుంబాల వివరాలు నమోదు చేసుకునేందుకు 45 నిమిషాల సమయం పడుతుందని సిబ్బంది తెలిపారు.

మోమిన్‌పేట: సమగ్ర కుల గణన శనివారం నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా పూర్తి స్థాయిలో కాలేదు. ఒక్కో ఎన్యుమరేటరుకు 15ఫాంలు మాత్రమే రావడం, అది కూడా మధ్యాహ్నం వారికి అందడంతో సర్వే కాస్త లేటుగా ప్రారంభించారు.


ధారూరు: దోర్నాల్‌లో కుటుంబ వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్


ధారూరు: శేరిగడ్డ తండాలో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్

రెండో శనివారం కావడంతో పూర్తి స్థాయిలో ఎన్యుమరేటర్లు అందుబాటులో లేకపోవడం, ఉన్న కొద్ది మందికి గ్రామస్తులు అందుబాటులో లేకపోవడంతో సర్వే ఆలస్యంగా సాగింది.

భయపడకుండా సమాధానాలు ఇవ్వాలి

పరిగి: సర్వేకు ప్రజలు ఎలాంటి భయం లేకుండా సమాధానాలు ఇవ్వాలని మండల అభివృద్ధి అధికారి కరీం సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలోని 37 గ్రామ పంచాయితీలలో 13,326 ఇండ్లకుగాను 98మంది ఎన్యుమరేటర్లు స్టిక్కర్లు చేసి వివరాలు సేకరించారన్నారు. సర్వే ఫారంలో మొత్తం 56 ప్రశ్నలకు ప్రజలు సమాధానాలు ఇవ్వాలని

ప్రజలు చెప్పిన వివరాలే నమోదు చేయాలి

పూడూరు: సర్వేకు వచ్చిన అధికారులకు గ్రామాల్లో ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ పాండు కోరారు. ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే ద్వారా మండలంలో శనివారం నుంచి కుటుంబాల వివరాలను సేకరిస్తున్నారు. మూడు రోజులుగా ఇండ్లకు స్టిక్కరింగ్ వేశారని తెలిపారు. అధికారులు అడిగిన వాటికి సమాధానాలు చెప్పి తమ దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసుకోవాలని సూచించారు. 31 పంచాయతీల్లో సర్వే ప్రారంభమైందని మొదటి రోజు కావడంతో ప్రతి గ్రామంలో పది నుంచి 15 ఇండ్ల వరకే సర్వే చేశారని తెలిపారు.


పూడూరు: ఎన్కేపల్లి గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

ఇబ్బందులు కలిగించొద్దు


కుల్కచర్ల: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

కుల్కచర్ల: ప్రజలకు ఇబ్బందులు కల్గించకుండా కుటుంబ సర్వే నిర్వహించాలని కుల్కచర్ల ఎంపీడీఓ రామకృష్ణ పేర్కొన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. ఎన్యుమరేటర్లు ఎవరి వద్ద ఎటువంటి జిరాక్స్‌లు తీసుకోవద్దని సూచించారు.

తప్పులు లేకుండా వివరాలు సేకరించాలి

కొడంగల్: హుస్సేన్‌పూర్ గ్రామంలో చేపట్టిన సర్వేను తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ ఉషశ్రీ, మున్సిపల్ పరిధిలో చేపట్టిన సర్వేను పరిశీలించారు. సర్వే కొనసాగుతున్న తీరును గమనించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ అంశాలను వివరంగా తీసుకోవాలన్నారు. తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని వారు సూచించారు.

40 నిమిషాలకో ఇళ్లు

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలో కొనసాగిన సర్వేలో ఒక్కో ఇంటికి సుమారు 40 నిమిషాల సమయం పడుతుందని ఎన్యుమరేటర్లు చెబుతున్నారు. రేషన్‌కార్డు, పింఛన్, భూమి, కులం, గ్యాస్, ఫ్రీ బస్సు వినియోగం, విదేశాలకు వెళ్లారా? అనే 56 ప్రశ్నలు కుటుంబ సభ్యులనుంచి రాబడుతున్నారు. సమాధానాలు సేకరించే సమయంలో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు.


తాండూరు టౌన్: 11వ వార్డులో కొనసాగుతున్న సర్వే

పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు


దోమ: బాసపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మహేశ్‌బాబు, ఎంఈఓ వెంకట్

దోమ: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు తాము ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ మహేశ్‌బాబు, ఎంఈఓ వెంకట్ పేర్కొన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని బాసపల్లి గ్రామంలో ఎన్యుమరేటర్లు, పంచాయతీ కార్యదర్శులతో కలసి సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి గ్రామంలో స్టిక్కరింగ్ కార్యక్రమం ముగిసిందని, సర్వేను నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి గ్రామంలో ఇంటి యాజమానులు అందుబాటులో ఉండాలన్నారు.

బంట్వారం: ఇంటింటి కులగణన సర్వే సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ రాములు ఎన్యుమరేటర్లకు సూచించారు. బంట్వారం మండల కేంద్రంలో మొదటిరోజు సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ తదితర అంశాలపై ప్రజల నుంచి సరైన సమాచారం సేకరించాలన్నారు. ఎక్కడకూడా పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే అధికారులను సంప్రదించాలన్నారు.


అనంతగిరి: సిద్దులూర్‌లో సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ వినయ్‌కుమార్


మోమిన్‌పేట: ఎన్కతలలో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్ రమేశ్


కొడంగల్: కార్గిల్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్


కొడంగల్: ఉషన్‌పూర్ గ్రామంలో తహసీల్దార్ విజయ్‌కుమార్


బంట్వారం: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాములు

నీటి పొదుపు అవసరం


పెద్ద చెరువు తైబందిని నిర్వహిస్తున్న నర్సింహులు

- డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు

దోమ: ఆయకట్టు రైతులందరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు పేర్కొన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని ఐనాపూర్ పెద్ద చెరువును అధికారులు సందర్శించారు. ఆయకట్టు రైతులతో కలిసి రబీ సీజన్ తైబందిని నిర్వహించారు. మొత్తం చెరువు కింద సుమారు 600 ఎకరాలు ఉండగా, దాదాపు 300 మంది రైతులు వరి పంట సాగు చేసుకున్నారు. వర్షాకాలంలో చెరువు నిండకపోవడంతో నీటి సామర్థ్యం తగ్గిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆయకట్టు రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. ప్రతి రైతుకు నీరు సక్రమంగా అందేలా పక్క పొలాల రైతులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుదర్శన్, ఇరిగేషన్ టెక్నికల్ అసిస్టెంట్ కేశవులు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, మాజీ ఆయకట్టు చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ భర్త ఆంజనేయులు, గ్రామ పెద్దలు జాఫర్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

దోమ: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ సర్పంచ్ చాపల వెంకటయ్య పేర్కొన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని రాకొండ గ్రామంలో ఆరు గ్యారెంటీలలో భాగంగా మహిళలకు సబ్సిడీ సిలిండర్ల ప్రొసిడింగ్‌లను మాజీ ఉపసర్పంచ్ కొత్త జంగయ్యతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్, గ్రామ సంఘం అధ్యక్షురాలు లక్ష్మి, గ్రామస్తులు కొత్త చంద్రయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని 2వ వార్డులో నిర్వహిస్తున్న అండర్ డ్రైనేజీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అండర్ డ్రైనేజీ పనులను నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో దశల వారీగా అండర్ డ్రైనేజీ పనులను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, మేనేజర్ నరేష్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.


అండర్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ అశోక్ కుమార్ తదితరులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పెద్దేముల్: పెద్దేముల్ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1994–95 సంవత్సరానికి చెందిన చిన్న నాటి స్నేహితులు 30 ఏళ్ల తరువాత శనివారం కలుసుకొని పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని పెద్దేముల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. తరగతి గదిలో చేసిన చిలిపి చేష్టలను, మధుర జ్ఞాపకాలను, అనుభవాలను గుర్తుచేసుకున్నారు. ఆ నాడు విద్యా బుద్ధులు నేర్పిన గురువులు గాల్రయ్య, గుడాచారి, కాశీనాథ్, ఆనంద్ కుమార్, జగదాంబ, సంధ్యారాణి, అప్పటి మాజీ సర్పంచ్ కిషన్‌రావులను విద్యార్థులు ఘనంగా శాలువా కప్పి సత్కరించారు.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అర్హులు ఓటు నమోదు చేసుకోవాలి


మోమిన్‌పేట: మాట్లాడుతున్న కార్యదర్శి నర్సింలు

మోమిన్‌పేట: అర్హులు ఓటు నమోదు చేసుకోవాలని కార్యదర్శి నర్సింలు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఎన్కతల గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఓటు నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 30వ తేదీ వరకు తమ ఓటును నమోదు చేసుకోవచ్చన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేందుకు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కారోబార్ నాగరాజు, మాజీ సర్పంచు శ్రీరాంలు, బీఎల్ఓ పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

కుక్కింద బీఎల్ఓ కేంద్రం తనిఖీ

ధారూరు: కుక్కింద గ్రామ పంచాయతిలో ఏర్పాటు చేసిన బీఎల్ఓ సెంటర్‌ను శనివారం తహసీల్దార్ సాజిదాబేగం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఓటరు జాబితాలో ఏమైన తప్పులుంటే సవరణ కోసం ఫామ్–8 దరఖాస్తును సమర్పించాలని సూచించారు. ఆదివారం కూడా పోలింగ్ స్టేషన్లలో దరఖాసులు స్వీకరిస్తామన్నారు. ధారూరు మండలంలోని 47 పోలింగ్ స్టేషన్‌లో 23 మంది ఫామ్–6 ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఫామ్–7 ద్వారా తమ ఓటు తొలగించడానికి 21 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు.

దోమలో..

దోమ: 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ మహేశ్‌బాబు తెలిపారు. దోమ మండల పరిధిలోని బాసపల్లి, బొంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఓటరు నమోదును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2025, జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండబోయే ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు నమోదులో సవరణలు, వెలువడిన ఓటరు జాబితాలో అభ్యంతరాలు తెలిపేందుకు బూత్ లెవల్ అధికారులు ప్రతి గ్రామంలో అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకట్, జూనియర్ అసిస్టెంట్ సరిత, పంచాయతీ కార్యదర్శులు మీనా, రవి, ఫీల్డ్ అసిస్టెంట్ రాములు, తదితరులు పాల్గొన్నారు.


ధారూరు: కుక్కింద పోలింగ్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సాజిదాబేగం


దోమ: బాసపల్లిలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీఓ మహేశ్‌బాబు